

# మన్నే నావాడు

సుచరిత

శ్రీ వారికి

నేను క్షేమంగానే చేరాను. ఇక్కడ యింట్లో అంతా కులాసాగా వున్నారు. నాన్నగారు స్టేషనుకి రాముడితో బండి పంపించారు. చెప్పటం మర్చిపోయాను మొన్న. నేను వచ్చేటప్పుడు "బోర్నవిటా" డబ్బాలో జంతికలు చేసిపెట్టాను. అవి చూడండి. వంట చేసుకుంటున్నారా? హోటల్ కెళ్తున్నారు? ఆఫీసు కెళ్లేటప్పుడు యిల్లు జాగ్రత్తగా తలుపులు తాళాలు వేసి పోండి. ఇంకేమీ సంగతులు లేవు అన్నట్టు....ఏదో చాలా....చాలా చెప్పాలని వుంది. చెప్పాలంటే చచ్చే సిగ్గు బాబూ!

మనకు పుట్టబోయే పాపాయికి ఏం పేరు పెట్టాలో ఆలోచిస్తున్నారా? చూడండి నాకెంత ఆత్రమో! అలులేదు చూలూ లేదు....అలావుంది. కానీ నాకు మాత్రం అమ్మాయే కావాలి. ఆడ పిల్లలు ఎంత ముచ్చటగా ఉంటారు! ఎంచక్కా రెండు జడలు వేసుకోవచ్చు. లంగాలు—గౌన్లు రక రకాలవి కుట్టించి తొడగచ్చు. మీ ఆరోగ్యం జాగ్రత్త. మిమ్మల్ని ఎప్పుడు చూస్తానా అని మనసు తహ తహ లాడుతోంది. అబ్బ....ఇంకా రెండు నెలలా!....నాకు మాత్రం రెండు యుగాలు!

మీ
"పారు"

చి॥ పార్వతికి

ఉభయ కుశలోపరి. నా గురించి ఆందోళన పడవద్దు. నీ వంటకన్నా హోటల్‌వాడి వంట బాగానే వుంటున్నది. నీ ఆరోగ్యం జాగ్రత్త.

ఇట్లు
గిరీశం.

పార్వతి రెప్ప కొట్టకుండా అలా ఆ ఉత్తరంకేసి ఎంతో సేపు చూసింది. దూరంగా ఉన్నప్పుడయినా కాస్త ప్రేమ చూపించ కూడదా?

భార్యకు కూడా ఉత్తరాలు వ్యాపార సరళితో రాయాలా? ముద్దులు—ముచ్చ పాలు లేవు. మనసైన కబుర్లు లేవు. ఇది....ఇది....ఒక భర్త ఒక భార్యకి రాసిన ప్రేమలేఖ!

పార్వతికి గతంలో ఒకనాటి సంఘటన గుర్తు వచ్చింది.

ఆనాడు....పార్వతి, గిరీశం ఆలా షికార్‌గా పొలాలవైపు వెళ్లారు.

ఎండ మండిపోతోంది. పార్వతి మన సంతా అర్థంకాని అనుభూతితో చిత్ర మయిన భావాలతో వూగిసలాడు తోంది చల్లని గాలి—బిగువైన ఎండ, మన సైన మనిషి....యింతకన్నా ఆనందం ఎందులో ఉంది? ఆకుపచ్చని పైర్లల్లో కుండా నడుస్తున్నారు యిద్దరూ.

చెట్ల ఆకులు పులకరించినట్టుగా తళ తళ లాడుతున్నాయి.

ఎక్కడ చూసినా ఆనందం!

ఎక్కడ చూసినా నవ్యత్వం!

పార్వతి తెరచాపలా ఎగురుతున్న పైటని బిగించి పట్టుకుని గిరీశంకేసి వోరగా తళుకుమనే చూపులతో చూసింది.

గిరీశం జేబులో రుమాలు తీసి తల మీద వేసుకుని "అబ్బ! ఎండగా లేదూ?" అడిగాడు.

పార్వతి సన్నగా నవ్వింది. "మీ పక్కన నడుస్తుంటే ఎండగా లేదు."

గిరీశం కళ్ళు చిట్లించాడు. "చూడు, నాతో ఏదో గొప్పగా కథల్లోలా మాట్లా డాలని అనుకోకు. మామూలుగా—ఫ్రీగా వుండాలి అంతే." అన్నాడు.

పార్వతి అభిమానం దెబ్బతిన్నది. మనస్సు విప్పి మనస్సులో మాట చెబితే అది కథల్లోలా మాట్లాడ బోవటము, గొప్పని ప్రదర్శించు కోవాలను కోవట మూను? తల వాల్చుకుని కూర్చుంది పార్వతి. కానీ పెళ్ళయిన మూడోనాడే అతని గురించి చెడుగా అనుకోవటం— అసంతృప్తి పడటం పార్వతికి నచ్చ లేదు. అంతలోనే గిరీశం,

"పాట పాడు" అన్నాడు.

పార్వతికి ఉత్సాహం పొంగి వచ్చింది.

కాళ్లు దగ్గరగా జరుపుకుని చేతులు పెనవేసి కూర్చుని "త్యాగరాజస్వామి కీర్తన పాడనా?" అడిగింది.

"అబ్బే. వద్దు. ఏదైనా మామూలు పాట పాడు."

ఒక్కక్షణం ఆలోచించి పార్వతి పన్నగా మొదలు పెట్టింది.... రెప్ప లార్ప కుండా ఓన్నెప్పుడైనా చూస్తినా....

టక్కులాడి చుక్కలన్ని ఫక్కుమని నవ్వుతాయి.

... ఎవ్వరు తోడులేని యాడికైనా పోదాము.

సిగ్గేస్తదోయ్ బావ సిగ్గేస్తదోయ్!.... పార్వతి పాట పూర్తిచేసి గిరీశంవేసి ఆసక్తిగా చూసింది. అతను అయిష్టంగా "బేవార్సుపాట! ఏదైనా హిందీపాట పాడు." అన్నాడు.

పార్వతి తల తిప్పుకుంది. "నేను హిందీ పాటలు నేర్చుకోలేదు." అంటూ.

"పారూ .పారూ ..! ఏం చేస్తు న్నావే!" సుగుణ పిలుస్తూ వచ్చింది గదిలోకి.

పార్వతి ఉలిక్కిపడి ఉత్తరం డ్రాయర్లో పడేసి మంచంమీద లేచి కూర్చుని "రా, అక్కయ్యా!" అంది.

"నీకు ఎన్నిసార్లు చెప్పాను పారూ, అలా డల్‌గా వుండకు ఈ స్థితిలో ఎంత ఉత్సాహంగా వుంటే అంత మంచిది తెలుసా? లేచి సంతోషంగా తిరుగుతూ వుండాలి."


పార్వతి నవ్వింది నీరసంగా. "ఏదో భయంగా వుందే!"

"భయం దేనికి? మేమంతా లేమూ! అయినా మొదటిసారి అలాగే వుంటుందిలే, అన్నట్టు మరిదిగారినుంచి ఉత్తరం వచ్చిందా?"

"ఇప్పుడే వచ్చింది అక్కయ్యా! క్షేమంగా వున్నానని రాశారు. అంతే!"

"ఉత్తరం అంతా చెప్పమనను లేవే చిట్టి తల్లీ! దాచుకో." సుగుణ కొంటెగా నవ్వి .. "పద ... అమ్మ భోజనానికి రమ్మంటోంది. నిన్ను పిలుద్దామనే నేను వచ్చి నీతో కబుర్లు వేసుకున్నాను. పద పోదాం."

పార్వతికి అమ్మాయి పుట్టింది ఓచల్లని మధ్యాహ్నం.




"అమ్మాయి—అమ్మాయి తెగ కలవరిస్తున్నావు గదే పారూ! దేవుడు 'నీ మొర ఆలకించాడులా వుంది" సుగుణ హాస్యం చేసింది.

"అబ్బ! ఎంత తెల్లగావుందో! అచ్చు పారు అక్కయ్య పోలికే!" గోపి మాంసం ముద్దలాంటి ఆ పసి మొహంలో పోలికలు గుర్తు పట్టినట్టుగా ఆరిందలా అన్నాడు.

"ఓ! అబ్బాయిగార్కి నచ్చిందన్న మాట. ఇంకేమే పారూ! నీ కూతురి పెళ్లి సమస్యే లేదు. మేనమామ రెడీగా వున్నాడు." సుగుణ అల్లరిగా అంటే అయిదేళ్ళ గోపి మొహం ఎర్రనయి పోయింది.

"ఛీ! నాకేం నచ్చలేదు, ఒట్టి కోతిలా వుంది!" అంటూ గదిలోకి పరిగెత్తాడు గదిలోంచి.

సుగుణ పగలబడి నవ్వింది.


"అబ్బ! ఏమిటే సుగుణా పసిపిల్ల లాగా! ఇంకా కళ్ళు తెరవని గుడ్డికి అంత సేపు చూడచ్చా?" తల్లి మందలించింది. అంతా వెళ్ళిపోయాక పార్వతి పాపాయిని గుండెలకి హత్తుకుని హాయిగా నిద్ర పోయింది అలసటతో.

ఆ క్షణంలో ఈ ప్రపంచంలో తనకు అత్యంత ఆప్తురాలు ఆ పసిగుడ్డే అన్న వూహ ఎంతో హాయిగా అన్పించింది.

* *

ప్రియమైన శ్రీ వారికి

పాపాయి—నేను క్షేమంగా వున్నాము. పాపాయి పుట్టినప్పుడు అంత పెద్దగా లావులేదు. గానీ యీవారం రోజుల్లోనే కాస్త వొళ్లు చేసింది. అమ్మ వాళ్లు అంతా మీ పోలికే అంటున్నారు. నాకు అలాంటి వేమీ తెలీదు. చటుక్కున పోలికలు పట్టెయడం కూడా ఓ కళే అనుకుంటా కదూ!




పాపకేం పేరు సెలెక్టు చేశారని అక్కయ్యా వాళ్ళంతా అడుగుతున్నారు. ఏమైనా పేరు ఆలోచించారా? సింపుల్‌గా-కాస్త ఫాషన్‌గా వుండే పేరు బావుంటుందేమోగా! నాకు మాత్రం 'శరత్ పద్మిని' పెట్టాలని వుంది. వెంటనే జవాబు రాయండి.

మీ
'పారు.'

పాపాయికి కాస్త శాంతి వుందనీ, బారసాల చేసుకోవాలి పదకొండో రోజుకి రమ్మనీ పార్వతి తండ్రి రాసిన దానికి సమాధానంగా గిరీశం—తనకి ఆఫీసు పన్లు ఎక్కువగా వున్నాయనీ 21 వ రోజుకి వచ్చి తనతోపాటే పార్వతిని తీసుకుపోతాననీ రాశాడు. ఉత్తరం చదివి పార్వతి తల్లి నోరు నొక్కుకుంది. "ఇదేం చోద్యమే పారూ! 21 రోజుల పచ్చి బాలింతని తీసుకుపోతానని అంటాడు. కనీసం మూడోనెల అన్నా రావద్దూ!" అంది.

పార్వతి మాట్లాడలేదు. తనని పురిటికి పంపేప్పుడు గిరీశం షరతు గుర్తు వచ్చింది.

గిరీశం మళ్ళీ పార్వతికి ఉత్తరం రాయలేదు.

* *

అనుకున్న ప్రకారం గిరీశం వచ్చాడు. పార్వతికి ఆపుకోలేని కుతూహలంతో "ఏం పేరు నిర్ణయించారు?" అని అడిగింది.

గిరీశం "అంత కుతూహలం ఏముంది యిందులో?" అన్నాడు. అంతేగానీ పేరు మాత్రం చెప్పలేదు.

మర్నాడు పీటలమీద తంతు పూర్తయ్యాక అతను బియ్యంలో ఏం రాయబోతున్నాడోనని పార్వతి కళ్ళు విప్పార్చి చూసింది.

ఒక్కొక్క అక్షరమే పూర్తి అయింది 'వెంకటలక్ష్మి' అని మిగిలింది చివరికి.

పార్వతి మొహం నల్లగా అయి పోయింది. ఆ క్షణంలో పీటమీద నుంచి లేచి పోవాలన్నంత ఆవేశం వచ్చింది. పెదవి కొరుక్కుంటూ అలాగే కూర్చుంది. పార్వతికేసి ఓరగా చూశాడు గిరీశం.

ఎవరూ ఏమీ కామెంట్ చెయ్యలేదు పేరు గురించి కానీ గోపి మాత్రం "ఛా! వెంకటలక్ష్మి ఏం పేరూ! ఎంచక్కా మల్లిక అయితే బాగుంటుంది గానీ!" అన్నాడు అసంతృప్తిగా.

గిరీశం సమర్థింపుగా "వెంకటలక్ష్మి మా అమ్మ పేరోయ్! దానికేం... లక్ష్మి అని పిల్చుకోవచ్చు సింపుల్‌గా" అన్నాడు. పార్వతికి గుండెలో ఏదో మంట రేగింది. మనసు విప్పి చెప్పిన తను ఫూల్ అయింది. శరత్ పద్మిని ..మాధవి.... మాలతి....సుధ....యివేమీ కావు. లాతల వాటి పేరు. మాతృభక్తి ...బతికినప్పు డుపయోగం గానీ ఆ పేరు పిల్లలు పెట్టు కుంటే అది వెల్లడవుతుంది. ఆహా!

తన కడుపున పుట్టిన బిడ్డకు పేరు పెట్టుకునే విషయంలో కూడా తన అభి ప్రాయానికి గుర్తింపులేదు. తన ఇష్టానికి విలువలేదు.

తను మాత్రం చచ్చినా ఆ పేరుతో పిలవదు. అతన్నే పిలుచుకోనీ ముద్దుగా లక్ష్మి అనీ—వెంకూ అనీ—వెంకట్ అనీ! తన కూతురికి తన యిష్టమయిన పేరు, తనకి నచ్చిన పేరు పెట్టుకుంటుంది. ఆ అధికారం నవమాసాలు మోసి కన్న తల్లికే లేకపోతే యీ ప్రపంచంలో ఇంకెవరికీ ఉండదు.

మధ్యాన్నం టిఫిన్ యిస్తుండే గిరీశం నెమ్మదిగా "పేరు నచ్చిందే పార్వతీ!" అని అడిగాడు.

పార్వతి చురుక్కున చూసింది. విసురుగా, పొద్దుట్నుంచీ దాచుకున్న కసి అంతా గొంతులో నింపి "నాకు నచ్చటం ఎవరికి కావాలి. 'బోడి నచ్చటం!' అని యిపత లికి వచ్చేసింది.

ఎవరు ఎంత నచ్చచెప్పినా గిరీశం విన లేదు. పార్వతితో మర్నాడు రాత్రికే బయ ల్దేరాడు. పుట్టింట్లో గడిపిన కాలం ఓ మధురస్మృతిగా మిగిలిపోయింది పార్వతి మనసులో.

పాపాయి మత్తుగా గుడ్డల్లో వెచ్చగా నిద్ర పోతోంది. తల్లి మనసేం ఎరగ నట్టుగా.

పార్వతి పాపాయిని వొళ్ళో పెట్టుకుని లైట్లకేసి చూస్తూ కూర్చుంది. పొడి కళ్ళతో.

"అయిన వాళ్ళందర్నీ వొదిలేసి వస్తు న్నాను చిట్టి తల్లీ! ఈ రోజునుంచీ నువ్వే నాకుతోడు" అనుకుంటుందేమో మనసులో.